# నెత్తురు చిమ్మిన నెచ్చెలి!

చంద్రశేఖర ఆజాద్

తెల్లవారగట్ట నాలుగు గంటలు దాటింది.

చలికాలం. జనం అంతా ఇంకా ముసుగులు బిగించే వున్నారు, చలికి వణుకుతూ వెచ్చదనంకోసం ఆరాట పడుతూ. పొగ మంచంతా కేంద్రీకరించబడి వుంది. యెదురుగా ఎవరు ఉన్నారో కళ్ళు చించుకున్నా కన పడటంలేదు, ఆ సమయంలో....

విశాలమైన ఆ ప్లే గ్రౌండ్‌లో ఓ వ్యక్తి నిలబడి ఉన్నాడు. అతని వంటికి బిగుతుగా నిక్కర్ వుంది. దానిపైన బనీన్ వుంది. చేతిలో ములుకర్ర. సాధన మొదలయింది. మంచును చీల్చుకుంటూ, గాలిని కోస్తూ చేతిలో కర్ర తిరుగుతోంది. కొంచెంసేపు ఆగాడు. ఇప్పుడతని చేతిలో రెండు కర్రలున్నాయి. విన్యాసం మొదలయింది.

వ్రేళ్ళనడుమనుండి జారిపోతూ, రకరకాల వంపులు తిరుగుతోంది. వందమందికి జవాబు చెప్పగల అత్యద్భుత ఫీట్ అది. గాలిని చీల్చుకుంటూ అవి చేస్తున్న శబ్దాలు

విచిత్రంగా వున్నాయ్. అలా అరగంట సాగింది. క్రమ క్రమంగా మంచు కరిగిపోతోంది. వెలుగు రేఖలు సన్నగా చాలా సన్నగా చొరబడటానికి ప్రయత్నం చేస్తున్నాయ్.

అతను కర్రల్ని ప్రక్కన పడేశాడు. గ్రౌండ్ చుట్టూ రౌండ్స్ ప్రారంభించాడు. పరిగెత్తుతున్నాడు. మంచు బిందువులు శరీరంమీద యేర్పడుతున్నాయ్. మంచును చీల్చుకుంటూ పరిగెత్తుతున్నాడు. ఓ రౌండ్ అయింది. అదే వేగంతో తిరిగి రెండో రౌండు మొదలయింది.

"ధన్" మంటూ దేన్నో కొట్టుకున్నాడు.

అతను ఒక్క క్షణం బిత్తరపోయాడు.

ఎదురుగా యెవరో "ఢబ్"మంటూ పడిన శబ్దం వచ్చింది. అతను వెళ్ళి క్రిందపడ్డ వ్యక్తిని లేవదీయ బోయాడు.

"యూ" కోపంగా అర్చాడతను.

"యస్" అన్నాడితను.

"కళ్ళు కనపడటంలేదా" తిరిగి అరిచాడు.

"లేదు బ్రదర్" సమాధానం.

అతను లేస్తూ నుదురు తడుము కున్నాడు. నుదురు బొప్పెక్కింది. అతనికి గుండాగినంత పనయింది.

"నా మొహం వాచింది."

"చ్చొ....చ్చొ....చ్చొ...."

"చ్చొ....చ్చొ....చ్చొనా. నువ్వు మనిషివేనా?"

"చూడు బ్రదర్. నీకెలా కనిపిస్తున్నాను."

"లేకపోతే ఏమిటి? పొద్దున్నే తగిలావు."

"అయినా నీవు ఈ పరిగెత్తాడాలెందుకు. ఇంటికగ్గర గుంజీళ్ళు తీసుకోక" అన్నాడితను.

"యూ" పిడికిళ్ళు బిగించి రాబోయాడతను.

“ఛల్ ఛే.”

గాలిని చీల్చుకుంటూ పరిగెత్తాడతను. వెంబడించబోయిన అతను ఆగిపోయాడు. తల జివ్వున లాగుతోంది.

“డెవిల్” గొణుక్కున్నాడు.

అప్పటికి ఆరు రౌండ్లు పూర్తయ్యాయి. సూర్యుడు పైపైకి వస్తున్నాడు. అతడు అలానే పరిగెత్తుకుంటూ ఇంటికి వెళ్ళాడు, ఇంకా వ్యాయామం చేస్తూనే.

“అమ్మా” అంటూ అరిచాడు.

“వస్తున్నా” లోపలనుండి జవాబు.

వస్తూ ఓ డజను కోడిగ్రుడ్లు....అప్పుడే పితికిన పచ్చి పాలు ఓ చెంబుతో తెచ్చి అక్కడ వుంచి “కానియ్” అంటూ వెళ్ళిపోయింది. మరుక్షణం గ్రుడ్లు పగిలిపోయి పాలతో కలిసిపోయాయి. వాటిని త్రాగేసి త్రేన్చాడు.

రెండు బకెట్లనిండా స్నానానికి నీళ్ళు తయారుగా వుంచబడ్డాయ్. తృప్తిగా స్నానంచేశాడు. టవల్‌తో తల తుడుచుకుంటూ వచ్చాడు.

ఇప్పుడతని రూపం మారిపోయింది. తెల్లటి పైజామా కుర్తా ధరించాడు. వెంట్రుకలు పాయలు పాయలుగా విడిపోయి అందంగా వున్నాయ్. అతను వెళ్ళి గిటార్ అందుకున్నాడు. అది చేతిలోనికి తీసుకున్నాక ఓసారి గుండెలకు అదుముకున్నాడు.

ఏవేవో జ్ఞాపకాలు!

చల్లటి పిల్లగాలి తెమ్మెర మృదువుగా స్పృశించుకుంటూ వెళ్ళింది. గాలికి రెపరెపలాడుతున్న వెంట్రుకలు మరింత అందంగా మొహాన్ని క్రప్పాయ్. గిటార్ అందులోని స్ట్రింగ్స్ సవరించాడు. మెయిన్ స్ట్రింగ్ కదిలేసరికి వెలువడ్డ ధ్వనికి ఆ గదంతా ఒక్కసారి పులక

రించింది. అతనిలో భావావేశం వచ్చింది. గిటార్‌ను అప్రయత్నంగానే ప్లే చేయటం ప్రారంభించాడు.

"టెలిగ్రాం" వినపడింది.

గిటార్ ప్రక్కన పెట్టి కంగారుగా వెళ్ళాడు.

సంతకం పెట్టి తీసుకున్నాడు. చించాడు.

"విజయ్.... స్టార్ట్ ఇమ్మిడియెట్లీ.... సృజన్."

ఒక్కసారి ఆనందంతో బిగ్గరగా కేకేశాడు.

"అమ్మా, స్వీట్" అనరిచాడు.

అంటూనే పరుగెత్తుకెళ్ళి ఓ డబ్బాలో ఉన్న పంచదార లడ్డు అందుకొని, టెలిగ్రాం తెచ్చిన వ్యక్తి దగ్గరకు వెళ్ళాడు. అతను ఆశ్చర్యంగా నోరు తెరిచాడు.

మరుక్షణం నోటినిండా లడ్డు కుక్కేశాడు విజయ్.

## 2

బ్యాగ్ సర్ది కూర్చున్నాడు విజయ్.

రైలు కదిలిపోతోంది. ఓసారి జేబులోనుండి లెటర్ అందుకొని చూశాడు. సృజన్ రాసిన లేఖ అది. చదువుకున్నాడు. ట్రైనింగ్ సెంటర్లో గడిపిన రోజులు గుర్తుకు వచ్చాయి. చిన్ని గుర్తొచ్చాడు. "లవ్లీ ఫెలో ఏం చేస్తున్నాడో?" అనుకున్నాడు. తాము ముగ్గురూ ప్రాణమిత్రులు.

బహుశా చిన్నికి కూడా టెలిగ్రాం ఇచ్చి వుండవచ్చు ననుకున్నాడు. ట్రైన్‌లో పెద్దగా రష్ లేదు. అయినా సన్నగా యేదో ధ్వని మొదలయింది. ఒకొక్కరే లేస్తూ ముందుకెళుతున్నారు. విజయ్‌కు అలా యెందుకు వెళుతున్నారో అర్థం కాలేదు. కొంచెంసేపు చూశాడు. తనూ లేచి ఆ వైపుకు వెళ్ళాడు.

లేవటరీ ముందు కొంతమంది ప్రోగయి వున్నారు.

వాళ్ళంతా గుసగుసలాడుతున్నారు. ఒకాయన హడా వుడిగా వచ్చి తలుపు నెట్టాడు. రాలేదు. ఒక్కక్షణం అతని చేతులు పొట్టని నొక్కిపట్టాయ్.

కొన్ని పెదవులు మెల్లగా విచ్చుకున్నాయ్.

విజయ్‌కు అదేం అర్థంకాలేదు.

"లవ్ ఎట్ ఫస్ట్ సైట్ లేవెట్రీ."

"ఫాంటాస్టిక్ లవ్."

"వేర్ లవర్స్ లివ్" అంటూ ఆగాడు ఓ వ్యక్తి.

ఎవరో ఏదో అన్నారు.

ఘొల్లున నవ్వారంతా.

"ఏది ఏమైనా గురూ, ఈ రోజు నాకో క్రొత్త ప్లేసు తెలిసింది. అయినా ఇంత కక్కుర్తా?"

"టిక్కట్లు లేవేమో?"

"ఏమిటి బ్రదర్" విజయ్ కదిలించాడు.

"లోపల ఓ జంట వుంది సార్."

విజయ్‌కు నవ్వు వచ్చింది.

నవ్వుకుంటూ వెనక్కు తిరగబోయాడు.

అప్పుడు కనిపించారు.

నల్లటి తుమ్మమొద్దుల్లాంటి వ్యక్తులు ఇద్దరు జనాన్ని నెట్టుకుంటూ వస్తున్నారు.

విజయ్ భృకుటి ఒక్కసారిగా సందేహంతో ముడత పడింది.

ఆగిపోయాడు.

"హుట్ .... హుట్" అన్నారు.

అప్పటిదాకా నవ్వుతూ కబుర్లు చెప్పిన మగవాళ్ళు వాళ్ళను చూడగానే భయంగా ప్రక్కకు తప్పు కున్నారు. అందులో ఒకడు తలుపు గట్టిగా తడుతూ

అరిచాడు.

"మర్యాదగా తలుపు తీయండి"

"ఊహూ."

మరోసారి చరిచాడు.

తలుపు దడదడమంది.

"ఏంటి గురూ. సంగతి" అన్నాడు విజయ్.

"నీ కనవసరం జే!"

"ఎందుకయ్యా బాబు కోప్పడతావు" అన్నాడు విజయ్."

"మర్యాదగా వస్తారా, తలుపు తెరిచెయ్యమంటారా?" అరిచాడు.

"ఊరుకో స్వామి. తలుపు తెరిస్తే బాగుండదు. జనం ఇబ్బంది పడతారు. వాళ్ళే వస్తారులే" అన్నాడు విజయ్ తిరిగి.

"ఏంది జే వాగుతున్నావ్. చంపేస్తా" అంటూ బొడ్డులోనుండి పదునైన కత్తి తీశాడతను.

అది చూడగానే జనమంతా భయంతో బిక్కచచ్చిపోయారు. మరుక్షణం ఆ ప్రదేశమంతా ఖాళీ అయింది.

"దీనికి కత్తెందుకులే గురూ" అన్నాడు విజయ్.

"ఛా" అంటూ అందులో ఒకడు పిడికిలి బిగించి తలుపును గుద్దాడు. తలుపు ముక్కలు ముక్కలుగా విరిగి పడిపోయింది. ఎదురుగా ఓ యువతి యువకుడు నిలబడి వున్నారు. ఆ అమ్మాయి మరింత భయంగా ఆ యువకుడికి ఒతుక్కుపోయి వుంది. ఆ అమ్మాయి మెడనిండ నగలున్నాయి. ముఖంలో కనిపిస్తున్న భయం మాటున అమాయకత్వం....స్వచ్ఛత స్పష్టంగా కనబడుతున్నాయి.

"బయటకురా" అరిచేడు తిరిగి.

"ఉహు" అందా అమ్మాయి.

"చంపేస్తా."

"చంపెయ్యి."

విజయ్ ఆ మాటలు విని చలించాడు.

"ఏమిటి గురూ!" అన్నాడు.

"మళ్ళీ మొదలా" అంటూ ఈ వైపుకు తిరిగాడు రాడీ.

"నీ బాబుగాడి సొమ్మని తలుపు పగలగొట్టావా? నా కొడకా.... ఈ వాసనంతా ఏంటిరా?" అన్నాడు విజయ్.

"ఆ" అంటూ లిప్తపాటు ఆశ్చర్యపోయి వెంటనే కత్తితో పొడవబోయాడు.

కత్తి గాల్లోనే ఆగిపోయింది. అంతలోనే విసురుగా లేచిన విజయ్ చెయ్యి రాడీ భుజంమీద పడింది. అంతే. చచ్చుబడిపోయినట్లు వ్రేలాడింది. అతను బాధగా కత్తిని వదిలేశాడు. కంగున మ్రోగింది క్రిందపడుతూనే.

ఫట్‌మంటూ కడుపులో ఓ పంచ్.

"అబ్బా" అంటూ ఓ చేత్తో కడుపు పట్టుకు కూర్చున్నాడు. ఆసరికి రెండోవాడు ఛెయిన్ విసిరాడు. విజయ్ వీపుమీదపడి చర్మం లేచి వచ్చింది. అంతులేని ఆగ్రహం వచ్చేసింది. అమాంతం వాడ్ని అందుకొని పైకి లేపేశాడు. తలుపుకేసి విసిరికొట్టాడు.

అంతే! వాడు కొంచెంసేపు మాట్లాడలేకపోయాడు. బిర్ర బిగుసుకు పోయాడు. విజయ్ తాపీగా వెళ్ళి డోర్ తెరిచాడు. కడుపు పట్టుకొని కూలబడ్డవాణ్ని లేపి, ఓ తన్ను తన్నాడు. వాడు వేగంగా బయటకు విసిరి వేయబడ్డాడు.

రెండో వాడు తేరుకొంటున్నాడు. వాడిని లేపాడు. మరుక్షణం విసురుగా తాకింది కాలు. అంతే వందకిలో మీటర్ల వేగంతో అరుస్తూ బయటపడ్డాడు.

ట్రైన్ సాగిపోతూనే వుంది.

ఆ జంట ఇంకా భయం భయంగా నే చూస్తున్నారు.

"రండి" అన్నాడు విజయ్.

వాళ్ళిద్దరూ బయటకొచ్చారు.

"ఎవరు వాళ్ళు" అన్నాడు.

"మేం ప్రేమించుకున్నాం. ఈ అమ్మాయి మా ఊరి మోతుబరిగారి కూతురు. ఆయనకు ఇష్టంలేదు. బలవంతంగా పెళ్ళిచేయబోతుంటే వచ్చేశాం" అన్నాడా యువకుడు.

"ఎక్కడకు వెళతారు?"

"పట్నం."

"ఎలా బ్రతుకుతారు?"

"బంగారం వుందిగా" అందా అమ్మాయి చటుక్కున.

"మరలా రాడీలొస్తే?"

"ఆ కళ్లు తిరిగి భయంగా చూశాయి.

"ఇంటికి వెళ్ళకూడదూ...." అన్నాడు తిరిగి.

"చచ్చినా సరే. కలిసే చస్తాం" దృఢంగా అన్నాడా యువకుడు.

విజయ్ ఆశ్చర్యపోయాడు.

"వెల్ బెస్టాఫ్ లక్" అంటూ వెనక్కు తిరిగాడు. వెనకాల అంతా రక్తం. ఛైయిన్ దెబ్బకు చొక్కా చినిగి శరీరం లేచిపోయింది. ఆ అమ్మాయి కంగారుగా చేతిలోని కర్చీఫ్ అందించబోయింది.

"ఫర్వాలేదు" అంటూ బ్యాగ్ తెరిచాడు. ఫస్ట

ఎయిడ్ బాక్స్ అందుకున్నాడు. ఆ యువకుడు దూదిలో రక్తం అంతా తుడిచాడు. టించర్‌తో అద్దాడు.

ఆ చోట శాల్నే చించి కట్టుకట్టాడు. తిరిగి మరో షర్టు వేసుకొని సీటుకు ఆనుకుంటూ అన్నాడు.

"థాంక్యూ!"

రైలు సాగిపోతోంది.

వాళ్ళిద్దరూ విజయ్‌వంక కృతజ్ఞతతో చూశారు.

విజయ్‌కు మెల్లగా నిద్ర పట్టింది.

కంపార్టుమెంటంతా ఆశ్చర్యంగా ఆ విషయం గురించే మాట్లాడుకుంటున్నారు.

## 3

స్టేషన్‌లో ట్రైన్ ఆగింది. అంతకు ముందే విజయ్ లేచాడు. బ్యాగ్ అందుకుంటూ చూశాడు. ఆ జంట తన వంకే చూస్తున్నారు. మెల్లగా నవ్వాడు. ఆ అమ్మాయి మోచేత్తో అతన్ని పొడవటం విజయ్ గమనించాడు. ఆ యువకుడు ఇబ్బందిపడుతున్నాడు.

"ఏమిటి?" అంటూ తనే అడిగాడు.

"మీ పేరు?" నసిగాడు.

"అదా.... విజయ్!"

బ్యాగ్ చేతిలోకి తీసుకున్నాడు.

"మరలా కలుసుకుందాం" అని దిగేశాడు.

నడుస్తూ అనుకున్నాడు. మరలా ఎక్కడ కలవగలమని తనన్నాడు. రైలుప్రయాణంలాంటి జీవితంలో అనేక మందిని కలుసుకుంటారు. తిరిగి వారందరినీ మరలా మరలా కలుసుకోవటం వీలవుతుందా?

అంతే! జీవితాల్లో అనేకరకాలైన అద్భుతాలు జరుగుతుంటాయి. అవన్నీ ముందే ఊహించలేకపోవచ్చు.

అందుకే మానవుడు తాననుకొంది ఎదురయినపుడు పొందే అనుభూతి రక రకాలుగా ఉంటుంది.

టికెట్ ఇచ్చి బయటకు వచ్చాడు విజయ్.

అదే క్షణంలో రయ్ మంటూ దూసుకొచ్చిందో కారు. హడావుడిగా అందులో నుండి దిగాడో వ్యక్తి.

విజయ్ నిలబడిపోయాడు.

కారులో నుండి దిగిన వ్యక్తి కళ్ళు ఆనందంగా ఆత్మీయంగా 'విజయ్'ను ఆసాంతం పరిశీలిస్తున్నాయ్.

విజయ్ ముందు తేరుకున్నాడు. నడిచి అతని దగ్గరకు చేరాడు.

"సుజ్జీ!"

"విజయ్!"

సృజన్ నవ్వాడు.

"ప్రయాణం బాగా జరిగిందా?"

"ఆ."

"గెటిన్" అన్నాడు సృజన్.

విజయ్ చేతిలోని బ్యాగ్, సూట్‌కేస్ డిక్కీలో చేరిపోయాయి. ఇద్దరూ కారులో కూర్చున్నారు. కారు కదిలింది.

"ఏమిటి సంగతులు?"

"ఏమున్నాయి."

"నీ దగ్గర నుండి లెటర్ వస్తుందనుకోలేదు."

సృజన్, విజయ్ వంకోసారి చూశాడు.

"ఏమిటిది?" షర్టుకు అంటిన రక్తపు మరకలు చూచి కంగారుగా అడిగాడు.

"ఓ... అదా రైల్లో చిన్న అడ్వెంచర్" అంటూ జరిగింది చెప్పాడు.

"అవునూ, చిన్ని వస్తున్నాడా?"

"అరెరే. చూశావా నిన్ను చూడగానే విషయం మర్చిపోయాను. చిన్ని రావాలి."

"ఏ ట్రైన్‌కు వస్తాడో?"

రోడ్డుమీద జనం అంతా విచిత్రంగా చూస్తున్నారు.

"చిన్నిని ఎలా రిసీవ్ చేసుకోవా లబ్బా" అంటున్నాడు సృజన్.

"ఇలాగే బ్రదర్!" గాల్లోంచి వినబడ్డాయి మాటలు.

ఈసారి నిర్ఘాంతపోయారు సృజన్, విజయ్‌లు.

ఆ కారుతోపాటు చిన్ని పరుగెత్తుకొస్తున్నాడు.

"ఓ....చిన్నా....స్టాప్" అరిచాడు సృజన్.

కారాగిపోయింది.

"యూ....సిల్లీ బాయ్. ఎంత సేపయింది వచ్చి?"

"మీ ఇద్దరూ ప్రపంచాన్ని మరిచిపోయినప్పుడు."

"గెటిన్."

చిన్ని కార్లోకి వచ్చి కూర్చున్నాడు. కారు కదిలింది.

"ఏం చేస్తున్నావ్?"

"ఏముంది? వాలీబాల్ టోర్నమెంటు జరుగుతుండగా నీ టెలిగ్రాం వచ్చింది. అంతే గో టూ హెల్ అంటూ పరిగెత్తుకొచ్చాను. తీరా చూస్తే స్టేషన్‌లో బండి లేదు. దానికోసం రన్నింగ్. ఇక్కడకొస్తే కళ్ళముందే మీరు బయలుదేరారు. తిరిగి రన్నింగ్. మొత్తంమీద నీ టెలిగ్రాంతో నన్ను పరిగెత్తించావ్" అన్నాడు చిన్ని.

"విజ్జి సాహసం చేశాట్ట ట్రైన్‌లో."

"రాకుమారి దక్కనులే."

"అందుకు కాదోయ్" అన్నాడు విజయ్.

"మరెందుకో చెప్పెయ్యకూడదా!"

"ఇద్దరు రౌడీల్ని బయటకు విసిరేశానోయ్."

"టిక్కెట్లు లేవా? అయినా ఆ పని నీది కాదుగా."

"ముందు మీరు చెప్పింది వినటం నేర్చుకోవాలి!"

"ప్రొసీడ్."

"ఒకమ్మాయి, ఒకబ్బాయి ప్రేమించుకొన్నారు. వాళ్ళమీదకు అమ్మాయి బాబు రౌడీల్ని పంపాడు. అంచేత వాళ్ళని రక్షించాను."

"బాగుంది."

"ఏం బాగులే ఫైయిన్ పెట్టి చీరేసాడొకడు. బంగారంలాంటి చొక్కా పోయింది."

"పోతే పోయిందిలే వెధవ చొక్కా. ప్రేమ ముందు సామ్రాజ్యాలే నాశనమయ్యాయి. ప్రేమే నేరమానా?" అన్నాడు చిన్ని.

"బాబు, పోయింది మీ చొక్కా కాదు. వాచింది నా వీపుకాదు."

"ఏమయితే ఏంగాని రుచి, వాసనెరుగని ప్రేమను సక్సెస్ చేశావు" అన్నాడు సృజన్.

విజయ్ నవ్వాడు.

కారు ఓ పెద్ద బంగళాలోనికి దూసుకుపోయింది.

## 4

రాబర్టుగారి నోట్లో పైపు ఉంది. పీలుస్తూ ఆలోచిస్తున్నాడాయన.

సృజన్ మిత్రులతో లోనికి ప్రవేశించాడు.

"సర్!"

"ఓ" నోట్లోంచి పైపు తీశాడు.

"ఢిసీజ్ మిస్టర్ విజయ్ అండ్ చిన్ని."

"నమస్కారం" ఒక్కసారే అంటూ ఇద్దరూ చేతులు జోడించారు.

రాబర్టు తల పంకించారు.

"ప్లీ సిట్ డౌన్."

అందరూ కూర్చున్నారు. విజయ్....చిన్ని నేలవంక చూస్తుండిపోయారు. రాబర్టు వారిని నిశితంగా పరిశీలిస్తూ ఉండిపోయాడు కొంతసేపు. వెంటనే తన ముందున్న బజర్ నొక్కాడు.

"ఓ అమ్మాయి ట్రేలో పొగలు క్రక్కుతున్న టీ తెచ్చి వారిముందు పెట్టి వెళ్ళిపోయింది.

"కమాన్. తీసుకోండి" అన్నారాయన కప్పు అందుకుంటూ. టీ త్రాగుతూ కొంతసేపు ఆలోచించారు. కప్పు క్రింద పెట్టారు.

అందరూ టీ త్రాగటం పూర్తయింది.

"వెల్ యూ నో....ఐయామ్ రాబర్టు. మీతో మాట్లాడే ముందు మిమ్మల్ని ఓ విషయం అడగదలుచుకున్నాను. జీవితం గురించి మీ అభిప్రాయం ఏమిటి?"

విజయ్ మాట్లాడలేకపోయాడు.

చిన్ని సంశయిస్తున్నాడు.

"అఫ్‌కోర్స్. ఒక్క నిముషంలో చెప్పగలిగే ప్రశ్న కాదు. నాకు తెలుసు. ఈ రోజున ప్రపంచంలో అనేకానేక దారుణాలు జరిగిపోతున్నాయి. క్రైమ్ అనేది ఓ జీవితావసరంగా మారుతోందన్నా ఆశ్చర్యం లేదు. అలాంటి భయంకర పరిస్థితుల్లో మనం బ్రతుకుతున్నాం."

"అవును" అన్నారు వాళ్ళంతా తమకు తెలియకుండానే.

"ఈ దారుణాలు జరగటం వెనుక ఓ ప్రధానమైన లింక్ ఉంది. ప్రతి నేరం వెనకవున్న అసలైన కార

ణాలు ప్రపంచానికి తెలియటంలేదు. తెలియనివ్వటంలేదు. అందుకు అనేక కారణాలున్నాయి. అందుకే మేం నూతనంగా ఓ సంస్థ నెలకొల్పాం. వివిధ దేశాల్లో విశాల భావాలు కలవారంతా దీని మూలపురుషులు. ప్రతి దేశంలోనూ ఈ సంస్థ శాఖలు ఏర్పాటవుతున్నాయి. మన సంస్థకు ప్రభుత్వంతో సంబంధం లేదు. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వాలు జరిపించే దారుణాల గుండెల్లోకి సైతం వెళుతుంది.

నేరాల వెనుక నున్న కారణాల్ని వెలికితీసి జనం ముందుంచటమే ఈ సంస్థ లక్ష్యం. ఇదీ ఒక డిటెక్టివ్ ఏజెన్సీలాంటిదే. అయితే ఈ సంస్థలో చేరేముందు ఓ పవిత్ర లక్ష్యం ఉండాలి. ప్రాణాల్ని అవసరమయితే త్యాగం చెయ్యటానికి తయారుగా ఉండాలి. మనం ఎదుర్కోబోయే శక్తులు అత్యంత బలమయినవి. ప్రమాదకరమైనవి. కాబట్టి ఎలాంటి పరిస్థితులనయినా తట్టుకోగల ధైర్యం, చొరవ, తెలివితేటలు ఉండాలి. వాటిని అభివృద్ధి చేసుకోవాలి.”

ఆగారాయన.

వాళ్ళంతా నోట మాట లేకుండా వింటున్నారు.

“జీవితంలో మీకు సమాజానికి ఉపయోగపడాలనే ఆకాంక్ష ఉంటే....అందుకోసం ఎలాంటి పోరాటానికయినా మీరు సిద్ధంగా ఉంటే ఆ నిబద్ధత మీలో ఉంటే ఎఫ్....ఎఫ్ మిమ్మల్ని పిలుస్తోంది” గంభీరంగా అన్నారు రాబర్ట్.

విజయ్, చిన్ని మౌనంగా వుండిపోయారు.

“మీరంతా యువకులు. మీరు కార్యరంగంలో ఉంటారు. అవసరమైన సలహాలు, సూచనలు మేమందిస్తాం.

మీరు నేర్చుకోండి. జీవితంలోకి వెళ్ళండి. పోరాడండి. ప్యాక్ట్ ఫైండర్స్ సంస్థ మనముందు ఓ మొగ్గగా ఉంది. అది వికసించాలి. జన జీవితంలో భాగమై పోవాలి. అందు కోసం సెంటిమెంట్స్ .... అనుబంధాలు .... అన్నింటిని త్యజించాల్సి ఉంటుంది.

సృజన్ స్నేహితులుగా, ఈ దేశపు బిడ్డలుగా మీరు ఈ సంస్థలోకి ప్రవేశిస్తే నేను స్వాగతంపలుకుతున్నాను" అన్నారు రాబర్టు తిరిగి.

సృజన్‌కు చాలా టెంక్షన్‌గా వుంది. చిన్ని, విజయ్ ఏమంటారో?

"సర్, మీ సంస్థ గురించి పూర్తిగా అర్థం కాక పోయినా కొంతవరకు అర్థం చేసుకున్నాం. సృజన్‌కు మాకూ నడుమ ఏర్పడ్డ ఈ అనుబంధం జీవితాంతం కొన సాగాలనేది మా కోర్కె. మాకు ఈ సంస్థలో పనిచేసే అవకాశం లభించటం మా అదృష్టంగా మేం భావిస్తు న్నాం" అన్నాడు విజయ్.

రాబర్టు కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"నాకు తెలుసు మీరు సిద్ధం అవుతారని. సృజన్ సెలక్షన్ మిస్ కాదని—ట్రైనింగ్ సెంటర్లో మీరు నేర్చుకొన్న విద్యలకు మరింత పదును పెట్టాలి. శరీరాన్ని యే రకమయిన కష్టాన్నయినా భరించటానికి సిద్ధం చెయ్యాలి. ప్రస్తుతానికి మనకేం కార్యక్రమం లేదు. మీరీ నాగరిక సమాజంలోకి వెళ్ళండి. అధ్యయనం చెయ్యండి. ఎంజాయ్ చెయ్యండి."

సృజన్ మిత్రులవంక చూశాడు.

"మైడియర్ బాయిస్, ఈ సంస్థను పటిష్టం చేసే

బాధ్యత మీది" అన్నారాయన ముగింపుగా.

వారు ముగ్గురూ ఆత్మవిశ్వాసంతో—

తల ఊపారు.

# 5

రాత్రి పదిగంటలు దాటుతోంది.

సృజన్ ....చిన్ని ....విజయ్‌లు బయలుదేరారు.

సెరాక్ హోటల్ వాళ్ళు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'మిస్ డెయానా డాన్స్ అండ్ మ్యూజికల్ నైట్' ఆమె నృత్యం అద్భుతం. శరీరంలోని యే భాగాన్నయినా అద్భుతంగా కదిలించగల అద్భుతమైన ఆమెది ప్రత్యేకమైన ఆర్క్రెస్ట్రా వుంది. ఆమె ప్రోగ్రాం కోసం చాల మంది ప్రయత్నించారు. సెరాక్ మాత్రం సాధించగలిగింది. మిత్రులు ముగ్గురూ అదే హోటల్లో బస చేశారు.

ప్రోగ్రాం ఇంకా మొదలవలేదు. వెయిటర్ వచ్చాడు. సృజన్ కూల్ డ్రింక్స్‌కు మాత్రం ఆర్డరిచ్చాడు. మరుక్షణం థమ్సప్ తెచ్చి ముందుంచాడు.

నాన్ వెజిటేరియన్ ఫుడ్ మాత్రం దిట్టంగా ఆర్డరిచ్చేసేరు. చిన్ని గ్లాసుల్లో థమ్సప్ పోశాడు. ఐస్ క్యూబ్స్ వాటిలో వేశాడు. సృజన్ వాళ్ళ గ్లాసుల్లో కూడా పోసి ఐస్‌ముక్కలు వేశాడు. స్టేజిమీద ఆర్కెస్ట్రా మొదలయ్యే దశలో ఉంది.

మ్రోగుతున్న డ్రమ్స్....గిటార్ మెరుపులు అదో రకం అనుభూతిని కలిగిస్తున్నాయ్. మధు గొంతు సవరించుకున్నాడు.

అంతా నిశ్శబ్దం!

"వెస్ట్రన్ స్టైయిల్లో మ్యూజిక్ తారస్థాయి నందుకొంది. పది నిముషాలు సాగిందలా. ఒక్కసారే లైట్లు

ఆరిపోయాయ్.

పిన్ డ్రాప్ సైలెన్స్ ఆవరించుకొంది.

"మిస్ దయానా!" మంద్ర స్వరాన వెలువడిందో శబ్దం.

అప్పుడో మెరుపు స్టేజిమీద.

అందుకొంది ఆర్కెస్ట్రా.

"హ్...దయానా" నిట్టూర్పుల సెగలు.

"ధన్ .... ధన్ .... ధన్ ...." డ్రమ్స్ మ్రోగుతున్నాయి.

దయానా గిరున తిరుగుతోంది. పది....ఇరవై.... ఏభై....వంద....రౌండ్లు.... టెన్షన్‌తో బిగుసుకుపోయారందరూ. డ్రమ్స్ తారాస్థాయి నందుకొన్నాయి. వాటిలో మెలికలా గిటార్ విచిత్ర తరంగాలు వెలువడుతున్నాయి. అలా రెండువందల రౌండ్లు పైచిలుకు తిరిగి ఆగింది. చూసేవారికి మొత్తం దయాన్ అంతా గిరున తిరుగుతున్నట్లయింది. చిరునవ్వుతో అభివాదం చేసిందందరికి.

నాలుగు ప్రక్కలనుండి గాల్లోకి ఎగిరివచ్చాయి నోట్ల ఉండలు. ఆ తర్వాత జనం అరగంట మాత్రం జనం కళ్లు ఆశ్చర్యంతో చూస్తుండిపోయాయ్. చాలా గొప్ప నృత్యం దయానాది.

చిన్ని....విజయ్....సృజన్ చూస్తున్నారు.

మొహంలో చిరునవ్వు కదిలాడుతుంది వారికి. చిన్నిలో ఎందుకో టెంక్షన్ మొదలయింది.

గ్లాసెత్తుకొని సిప్ చేశాడు.

అప్పుడు వినిపించిందో ఎనౌన్స్‌మెంట్!

"బెట్....దయానాతో సమానంగా డ్యాన్స్ చేసి

నెగ్గితే వారికి రెండువేల రూపాయల బహుమానం. అలాగే డయానాస్ ఆర్కెస్ట్రాతో పోటీపడేవారికి సైతం ఈ సవాల్ వర్తిస్తుంది. ఎనీబడీ ఫైవ్ మినిట్స్‌లో ముందుకు రావాలి."

ప్రకటన అయిపోయింది.

అంతా నిశ్శబ్దం.

నిముషాలు గడుస్తున్నాయి.

"ఓడిపోతే రెండువేలు మనం కట్టాలా" యెవరో అంటున్నాడు.

"సీరియస్‌గా" జవాబు.

చిన్ని సృజన్ వంక చూశాడు.

సృజన్ పెదవులమీద అంగీకారంతో కూడిన దరహాసం వెలిసి మాయం అయింది.

తల ఆడించాడు.

అంతే. విజయ్ అక్కడినుండి మాయం అయ్యాడు.

"వియ్ ఆర్ రెడీ" చిన్ని అరిచాడు.

అందరి కళ్ళు ఇటు తిరిగాయి. సృజన్ వాలెట్ తీసి రెండువేలు చిన్నికిచ్చాడు. సరదాగా నవ్వుకుంటూ 'డయానా' ముందుంచి—

"బెట్!" అన్నాడు.

అప్పుడే విజయ్ లోపలకు వచ్చాడు. ఓ చేతిలో గిటార్, మరో చేతిలో డ్రమ్స్ వున్నాయ్.

డయాస్ మీదికి చేరుకున్నారు ముగ్గురూ.

జనంలో ఉత్సాహం వచ్చింది.

డయానాస్ ఆర్కెస్ట్రా మొదలయింది.

డిస్కో లైటింగ్ ఎఫెక్టులో డయానా నృత్యం మొదలయింది. చిన్ని డ్యాన్స్ కూడా మొదలయింది.

దయానాతో పోటీగా వంపులు తిరుగుతున్నాడు. ఆర్కెస్ట్రా తీవ్రస్థాయి నందుకొంది. కానీ చాలా ఈజీగా నటించేస్తున్నారు ఇద్దరూ.... చేతులు నొప్పిపుట్టు కాబోలు ఆర్కెస్ట్రా ముగించారు. హాలు మ్రోగిపోయింది చప్పట్లతో.

ఎవరు గెలిచారో డిక్లేర్ కాలేదు.

అప్పుడు విజయ్ గిటార్ అందుకొని జనానికి విష్ చేశాడు.

సృజన్ వంక చూసి కన్ను గీటాడు.

అంతే....

సృజన్ గొంతునుండి మొదలయిందో గీతం.

గీతానికి ముందు రాగం.

గుసగుసలు సైతం ఆగిపోయాయ్.

సన్నగా మొదలయింది బేస్‌లోకి వెళ్ళిన ఆ స్వరం దయానాను ఒక్కసారి కదిలించేసింది.

రెండు నిమిషాలు నిలబడిపోయి మనస్సు నెక్కడికో తీసుకువెళ్ళే రమ్యగీతం అది.

విజయ్ చెయ్యి గిటార్ మీద పడింది.

అతిని వ్రేళ్ళ కదలికలు ఎవరికే వినిపించటంలేదు.

సృజన్ గొంతు ఎంత వేగంగా పదాలు పలుకుతుందో ఎవరూ ఊహించలేకపోతున్నారు.

చిన్న డాన్స్ మహాద్భుతంగా వుంది.

మణికట్టు దగ్గరనుండి మొదలయిన స్పందన శరీరంలోని ప్రతి అణువుకు సోకినట్లయింది. దయానాకు మొదటి సారిగా చెమటలు పట్టేశాయి. అయినా పట్టుదలతో అడుగులు వేస్తోంది.

మరోసారి సృజన్ స్వరం.

మహోన్నత శిఖరాగ్రాలకు....!

డయానా తూలింది.

ఫినిష్!

అడుగులు పడటం మానేశాయి.

సృజన్ గొంతు....

విజయ్ గిటార్....

అలా....అలా....మంద్ర స్వరాన.

హిమాలయాల ఎత్తుల కెళ్ళిపోయాయి.

వినేవారికి వారి రక్తనాళాలు చిట్లిపోతాయేమోనని పించింది.

చిన్ని డ్యాన్స్ చేస్తున్నవారికి డిస్కో ఎఫెక్ట్ కళ్ళ ముందు కనపడుతోంది.

అంత వేగం వారి జీవితాల్లో ఇంతకుముందెప్పుడూ చూడలేదు.

ఆ గానం....అలా....అలా వెళ్ళి ముగిసింది.

హాలునిండా ఈలలు....చప్పట్లు... డయానా అప్పటి దాకా నిలబడిందల్లా ఈ లోకంలోపడి తనూ చప్పట్లు కొట్టింది.

రూపాయల కాయితాలు ఉండలు ఉండలు వచ్చి పడుతున్నాయి.

చిన్ని ఆయాసంగా నవ్వాడు.

చాలామంది వాళ్ళ చుట్టూ ఎగబడ్డారు. హోటల్ మేనేజ్ మెంట్ ఆశ్చర్యంనుండి తేరుకోలేదు. వీళ్ళతో ఓ ప్రోగ్రాం ఫిక్స్ చేసుకోవాలనే ఆలోచన వెంటనే వారి మనస్సులో ప్రవేశించింది.

వారినుండి విడిపించుకొని డయాస్ దిగారు.

ఆ గదిముందు ఆగిపోయింది.

గాజులు గలలు.

ఉలిక్కిపడి ముగ్గురూ అటు చూశారు.

అక్కడో అమ్మాయి నిలబడుంది.

పెద్దింటి అమ్మాయిలా వుంది. ఆ అమ్మాయిని చూడగానే యెవరూ మాట్లాడలేదు. సృజన్ ముందుగా తేరుకున్నాడు.

"ఎవరు కావాలండీ?"

"మీరే."

కంగుతిన్నాడు సృజన్.

"మీరు...."

"మరచిపోయావా" టంగున మ్రోగింది కంఠం.

"ఐయామ్ సారీ....మీరెవరో నాకు తెలియదు."

"అవును. నాకు తెలుసు నువ్వామాట అంటావని" ఆమె కళ్ళలో నీరు తిరిగింది.

సృజన్‌కు అయోమయంగా వుంది. విజయ్, చిన్ని ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"నన్ను యెవరైనా మోసం చెయ్యొచ్చు. కానీ నీ కంఠం మాత్రం నన్ను మోసం చెయ్యదు. ఇరవై సంవత్సరాల అనుబంధాన్ని ఎలా త్రెంచుకోగలావ్" అంది ఆమె లోనికి అడుగు పెడుతూ.

సృజన్ చిన్నవంక, విజయ్‌వంక చూశాడు.

వాళ్ళు ప్రశ్నార్థకంగా తలలూపారు.

"చూడమ్మా, నువ్వు ఎవరిగురించి మాట్లాడుతున్నావో నాకు తెలియదు. నా పేరు సృజన్" అన్నాడు.

"నేనుకూడా మాట్లేకావన్నమాట."

"ఊఁ" అంటూ దీర్ఘం తీసి తలపట్టుకు కూర్చుండి పోయాడు చిన్ని. ఆ అమ్మాయికి కోపం వచ్చింది.

"వాడ్డూయూ మీన్. నేను పిచ్చిదాన్ననుకుంటున్నారా?" అంది.

"శ్లేతల్లి మాకు పిచ్చెక్కేట్టుంది" అన్నాడు చిన్ని.

ఒక్క క్షణం ఆ అమ్మాయి మొహంలో రంగులు మారిపోయాయి. అధారాలు కనిపించాయి. భృకుటి ముడి పడింది.

"మీరు నాతో రాగలరా" ఎంత మెల్లగా అందా మనుకున్నా ఆమెలో కోపంతో కూడిన పట్టుదల స్పష్టంగా కనిపిస్తోంది.

విజయ్, సృజన్ వంక చూశాడు.

"నాకేం అభ్యంతరం లేదు" అన్నట్లు భుజాలెగ రేశాడు సృజన్.

"జస్టు వెయిట్" అన్నారు.

"మీరు కూర్చోండి" అన్నారామెను.

ఆమె కూర్చుని గదంతా పరిశీలించటం ప్రారంభిం చింది.

ముగ్గురూ తయారయి బయలు దేరటానికి ఉపక్రమించేక కూడా లేచింది. రూమ్స్ లాక్ చేశారు. ఆమెతో పాటు బయలుదేరారు. పార్కు చేయబడ్డ కారును స్వయంగా నడుపుకుంటూ వచ్చిందామె. ముగ్గురూ వెనక సీట్లో కూర్చున్నారు.

అందరిలో తీవ్రమైన టెన్షన్.

ఎవరీమె? ఎక్కడకు తీసుకెళుతోంది?

సృజన్ తో ఆమెకున్న సంబంధం ఏమిటి?

అన్నీ ప్రశ్నలే! జవాబులు లేవు.

'ఫర్వాలేదు. అంతగా దురుద్దేశంతో తీసుకెళ్తుంటే ఆ మాత్రం ఆత్మరక్షణ చేసుకోలేక పోం' అనుకున్నా రంతా.

కారు వెళ్ళి ఓ బంగళా ముందాగింది.

గూర్ఖా గేటుతీశాడు.

లోనికి దూసుకుపోయింది.

షెడ్ దగ్గర ఆగింది. ఆమె ముందాగింది.

తర్వాత ముగ్గురూ దిగారు.

"ప్లీజ్ కమ్" అందామె ముందు నడుస్తూ.

ఆమె వెంట యాంత్రికంగా అనుసరించారు. ఆమె మెట్లెక్కింది. ఆ భవనం చాలా రిచ్ గా ఉంది. యే ప్రక్క చూసినా ఆధునిక జీవితపు హంగులన్నీ దర్శన మిస్తున్నాయి. మేడపైన కుడిప్రక్కకు తిరిగింది. ఆమెను అనుసరించారు. ఓ గదిముందు నిలబడి బ్యాగ్ నుండి తాళంచెవితీసి తాళం తీసింది. గదినుండి చల్లగాలి మొహాల్ని తాకింది. ఆమె లైట్ స్విచ్ ఆన్ చేసింది.

దేదీప్యమానంగా వెలుగు.

ఎదురుగా నిలువెత్తు చిత్తరువు!

ఆయిల్ పెయింట్స్ తో వేయబడి వుంది.

ఆ ఫ్రేమ్ లో వున్న వ్యక్తిని చూసి వారందరికీ పిచ్చెక్కినంత పనయింది.

ఆమె గర్వంగా వారివైపుకు తిరిగింది.

సృజన్ అవాక్కయి నిలబడి వున్నాడు.

ఆ ఫ్రేమ్ లోపల తన నిలువెత్తు ఛాయా చిత్రం అందంగా మలచబడి వుంది—

"కూర్చోండి" అందామె.

"అప్రయత్నంగా అందరూ కూర్చున్నారు.

"ఆ ఫోటోలో ఉంది కూడా నువ్వు కాదా కిరణ్" అందామె.

సృజన్ కొంచెంసేపు మాట్లాడలేదు.

"చూడమ్మా, నీ పేరు?"

"సంధ్య."

"ఐయామ్ సృజన్. ప్రపంచంలో మనుషుల్ని పోలిన మనుషులు వుండవచ్చు. మీరు పొరపడి వుంటారు. నేను కిరణ్ని కాదు" అన్నాడు.

సంధ్య కోపంగా అంది.

"కానీ కిరణ్ కూడా నీలానే పాడేవాడు. అదెలా సాధ్యం?"

సృజన్‌కు ఏం చెప్పాలో అర్థంకాలేదు.

సంధ్య కళ్ళవెంట నీళ్ళు కారిపోతున్నాయి.

"ప్లీజ్ ఏడవకండి" కదిలిపోతూ అన్నాడు సృజన్.

"కిరణ్ మీకేమవుతారు?"

"అన్నయ్య."

"మీరు నన్ను అన్నగానే భావించుకోండి."

సంధ్య కళ్ళు మెరిశాయి.

"కిరణ్ గురించి వివరాలు చెబితే సంతోషిస్తాం" అన్నాడు సృజన్.

సంధ్య కళ్ళనీళ్లు తుడుచుకుంది. సృజన్ కాళ్ళవంక పిచ్చిదానిలా చూసింది. ఆమెకు సృజన్ కిరణ్ అనే ఇంకా నమ్మకం. అతన్ని తన అన్నగాగాక, మరెవరిగానో ఊహించలేకపోతోంది.

ఆమె గొంతు సవరించుకుంది.

"కిరణ్ నా అన్న. చాలా గొప్పగా పాడతాడు. ఆ పాటలో తియ్యదనం నేను మాటల్లో వర్ణించలేను,

ఆ పాటలో జతకలిసింది మరో స్వరం. వాళ్ళు ప్రేమిం చుకున్నారు. ఆ అమ్మాయి కంఠంలో వేయి కోయిల స్వరాలుండేవి. ఆమె క్రిస్టియన్. అందుకే ఆ సంబం ధాన్ని తాతగారు ఒప్పుకోలేదు. వారిని విడదీయటానికి ఆయన చేసిన ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. పైపెచ్చు వారు తాతగార్ని యెదిరించటానికే నిశ్చయించు కున్నారు. ఆఖరకు మా తాతగారు ఆమెను హత్య చేయించటానికి ప్రయత్నం చేశారు."

"ఆమె చంపబడిందా?" మధ్యలోనే అడిగాడు. చిన్ని కుతూహలం చంపుకోలేక.

"ఏమో?"

"మీ తాతగారెవరు?"

"రావ్ బహద్దర్."

"జమిందారులా?"

"అవును" అంది సంధ్య.

"ఈ విషయం కిరణ్ కు తెలిసింది. వారం రోజుల క్రితం తాతగారితో తీవ్రంగా పోట్లాడాడు. ఆ మరుసటి రోజునుండే కిరణ్ జాడ తెలియకుండా మాయం అయ్యాడు. ఎంతగా వెదికించినా వారిద్దరి జాడలు తెలియలేదు. కిరణ్ లాంటి అన్న దొరకటం నా అదృ ష్టంగా భావించేదాన్ని. కానీ మాది గొప్ప వంశంకదా. అందుకే యిలా జరిగింది. మా ఆస్తులు....అంతస్తులు.... ఏవీ మమ్మల్ని కలపలేకపోయాయి. రెండు హృదయాల్ని కలపలేని ప్రేమల్ని ఒప్పుకోని ఈ ఆస్తులూ....అంతస్తులూ ఎందుకు? యెవరికోసం?" అంది సంధ్య. ఆమె గొంతు వణుకుతోంది.

"నేను అక్కడ వుండలేకపోయాను. మనశ్శాంతి

కోసం ఎక్కడెక్కడో తిరుగుతున్నాను. ఆఖరుకు ఈ ఊర్లో డయానా ప్రోగ్రాంలో పురివిప్పిన మీ గొంతు కిరణ్‌ను నా ముందుంచింది. ముమ్మూర్తులా కిరణ్‌ను పోలిన మిమ్మల్ని చూచి యెంతగా ఆనందపడ్డానో. కానీ విధి మరలా నాతో ఆడుకొంటోంది. మీరు కిరణ్ కాదంటే నేనది భరించలేను" అంది సంధ్య.

"చూడమ్మా, నువ్వు బాధపడ్డా యీ విషయం మాత్రం నిజం. నా పేరు సృజన్. నాకు చెల్లెలూ, అక్కా, మారెవరూ లేరు. నాకున్నది ఈ ఇద్దరు మిత్రులు. మరో తండ్రిలాంటి వ్యక్తి. అంతే. నిన్ను చూస్తుంటే నువ్వు నా చెల్లివయితే బాగుండుననిపిస్తుంది. కిరణ్‌తో నీకున్న అనుబంధం గురించి చెబుతుంటే మా మనసు అతనిపట్ల నీకుగల ప్రేమను గ్రహించింది. మేం కిరణ్ గురించి ఆరాతీస్తాం. అతనే కనక బ్రతికి వుండినట్లయితే తప్పకుండా నీముందుంచుతాం" అన్నాడు సృజన్.

సంధ్య కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"చెల్లీ" కళ్ళనిండా సోదర భావం నింపుకొని అన్నాడు సృజన్.

"ఇతను విజయ్. వీడు చిన్ని. మేమంతా సోదరులం. నువ్వు మా అందరి చెల్లివి.

వారందరివంక చూస్తూ ఆప్యాయంగా అంది.

"ఇందాకటినుండి ఊరకే మాట్లాడేస్తున్నాను...." అని లోపలకు వెళ్ళింది.

కొద్ది సేపటికి సంధ్య వచ్చి అందరినీ భోజనాలకు పిలిచింది. ఆమె స్వయంగా ముగ్గురికి కొసరి కొసరి వడ్డించింది. భోజనాలు పూర్తయ్యేక కిళ్ళీలు వేసుకున్నారు.

నావ్‌కిన్‌తో మొహం తుడుచుకుంటూ వచ్చింది

సంధ్య.

"ఏమ్మా భోజనం అయిందా?"

"అయింది."

"నాకయితే పొట్ట సాలిడ్ గావుంది" అన్నాడు చిన్ని.

"మనం మా ఎస్టేట్ కు ఉదయం బయలు దేరుతున్నాం"
అంది సంధ్య.

"ఓ.కే. అయితే ముందు రూమ్‌లో మా బట్టలు తెచ్చుకోవాలి. ఆ తర్వాత మా కారు అక్కడే వుండి పోయింది" అన్నాడు సృజన్.

"తెచ్చుకుందురుగాని. మరో విషయం మీకు చెప్పాలి. మా తాతగారు చండశాసనుడు. నిజంగా ఇన్ని సంవత్సరాల మా అనుభవంలో అధికారం తప్పించి ప్రేమంటే యేమిటో ఎరగం. మా తల్లితండ్రులు ఏక్సిడెంటులో చనిపోయారు. మా దురదృష్టానికదో కారణం అనుకుంటాను. కిరణ్ ఇన్ని రోజులనుండి కనపడక పోయినా ఆయనకు బాధ లేదు. అలాంటి మనిషి దగ్గరకు మనం వెళుతున్నాం. ఒక్క విషయం. నాకెందుకో ఇంకా మీరే కిరణ్ అనిపిస్తోంది. అయితే ఒక్కోసారి వాస్తవాలు ఎంత బాధాకరంగా ఉంటాయో! ఏమయినా మీరు కిరణ్‌ను వెదికి తీసుకురాగలరనేది నా ధృఢ విశ్వాసం...." అంది సంధ్య.

సృజన్ నవ్వాడు.

చిన్ని, విజయ్ "మరి బయలుదేరుదామా" అన్నారు.

"అలాగే" అంటూ లేచాడు సృజన్.

# 7

అదో కొండ మలుపు. మలుపు తిరిగి కారు వేగం అందుకుంది.

"ఇక్కడినుండే ప్రారంభమవుతుంది మా వైభవం" అంది నిర్లిప్తంగా సంధ్య.

చుట్టూ ఎటు చూసినా పచ్చటి చేలు.

"ఎన్నెకరాలుంటుంది?" అడిగాడు చిన్ని.

"తెలియదు. కొన్ని వేల యెకరాలుండవచ్చు. మా ఎస్టేట్ మేనేజర్‌కు తెలియవచ్చు" అంది.

"కొంత ఆయనకు వచ్చింది. మరికొంత ఆయన హయాంలో డెవలప్ చేశారు."

"ఇంత సొమ్ము యెలా సంపాదించేడబ్బా" అనాశ్చర్యపోయారు.

అలా ఓ అరగంట ప్రయాణం చేశాక ఓ పురాతన కోటలా....జానపద సినిమా సెట్‌లా వున్న భవనం దగ్గరికి కారు వెళ్ళి ఆగింది. కారు మోత వినగానే పరిగెత్తుకొచ్చి గేటుతీశాడు కావలివాడు. ఆ గేటు తెరుచుకుంటుంటే కిర్రు....కిర్రుమంది. ఎత్తుగా వున్న ఆ గేటు వంకే చూస్తుండిపోయాడు చిన్ని.

లోపలనుండి పనివాళ్ళు వచ్చారు. సృజను చూసి ఆశ్చర్యపోయారు. సంధ్య కళ్ళతోనే సైగలుచేసింది.

"రండి" అందామె లోనికి నడుస్తూ.

ముగ్గురూ ఆమెను అనుసరించారు. ప్రాచీన వైభవం గురించి, జమిందారుల కోటల గురించి పుస్తకాల్లో చదువుకోవటం మినహాయించి వారెప్పుడూ చూడలేదు. అక్కడ ప్రతి అంగుళం వింతగానే కనబడింది వారికి.

ముగ్గురికీ మూడు గదులు కేటాయించబడ్డాయి. ఎవరి గదిలో వారు ప్రవేశించారు. ఆ తర్వాతి స్నానాలు పూర్తయ్యాయి.

సంధ్య వచ్చి వారందరినీ ఆహ్వానించింది.

డైనింగ్ టేబుల్ కళాత్మకంగా వుంది. మధ్యలో ఓ సింహాసనంలా వుంది. అందులో బహుళా రావ్ బహద్దర్ గారు మీసాలు మెలేసుకుంటూ కూర్చుంటా డనుకున్నాడు చిన్ని. ఆ టేబుల్ చుట్టూ కుర్చీ లున్నాయి. వాటిలో కూర్చున్నారు.

టేబుల్ నిండా రకరకాల పదార్థాలు పేర్చబడి వున్నాయి. మరో ప్రక్క వివిధ రకాల పళ్ళున్నాయి. వాటిలో కొన్ని పేర్లే తెలియటంలేదు. చిన్ని ఏమాత్రం సిగ్గుపడకుండా తన అనుమానాలన్నింటిని నివృత్తి చేసు కున్నాడు.

భోజనాలు పూర్తయ్యాయి.

"మీ తాతగారు—?" అడిగాడు సృజన్.

"ఆయన్ను కలుసుకోవటానికి కొన్ని పద్ధతులున్నాయి. బెదిబే. మిమ్మల్ని కిరణ్ గానే ఇక్కడి ప్రజలు భావి స్తారు" అంది సంధ్య.

తలూపాడు సృజన్.

# 8

మధ్యాహ్నం కార్లో ముగ్గురూ బయలుదేరారు. సృజన్ తన డ్రెస్ స్టెయిల్ పూర్తిగా మార్చేశాడు. ఇప్పుడు ఎంతో పరీక్షించి చూస్తేగాని అతన్ని 'కిరణ్'గా గుర్తించడం కుదరదు. ఎస్టేట్ నుండి బయలుదేరి దూరంగా విసిరివేయబడినట్లున్న ఓ పల్లె దగ్గరకు చేరారు.

అక్కడ కనిపించింది మూర్తీభవించిన దరిద్రం. అంతకుముందు ఎస్టేట్ లోని సంపదలకూ ఇక్కడ చాలా తేడా స్పష్టంగా కనపడుతోంది. అక్కడ పిల్లలు నల్లగా వున్నారు. శరీరం నిండా సరైన గుడ్డలేదు. మట్టిగొట్టుకొని వున్నారు. తరతరాల దాస్య బంధాలేవో అక్కడ తిరు

గాడుతున్న వ్యక్తుల మొహాల్లో కనిపిస్తున్నాయి.

ఆ ఊరి నడుమ పెద్ద రావిచెట్టు వుంది. అక్కడ కారాపి ఎందుకు దిగారో వారికే తెలియదు. ఆ చుట్టు ప్రక్కల అడవులున్నాయి. అవి కూడా జమిందారుకు చెందినవే అని తెలుసుకున్నారు. అక్కడ యెవరిని పలకరించాలో అర్థంకాలేదు. అలా ఊరి చివరవరకూ నడిచి వెళ్ళారు. అన్నీ పూరిపాకలు....ఓ ఇరవై పెంకుటిల్లు వుండవచ్చేమో! నాగరికతకు చెందిన లక్షణాలేవీ ఆ పల్లెను సోకలేదు. అంత అమాయకంగా బ్రతుకుతున్నారక్కడి జనం.

"అలా అడవుల్లోకి వెళితే బాగుంటుంది" అన్నాడు చిన్ని. వాళ్ళని రెండు కళ్ళు తీక్షణంగా గమనిస్తున్నాయనే విషయం వారికి తెలియదు.

చిన్ని ఎవరి దగ్గరికో వెళ్ళాడు.

"ఈ రూట్‌లో వెళితే అడవి వస్తుందా?"

"వద్దు బాబుగారు" అన్నాడతను.

"ఏం?"

"రాత్రి చిరతొచ్చి గూడెంలో కుర్రాడ్నెత్తుకుపోయింది."

"అయ్యయ్యో" నొచ్చుకున్నాడు.

"మొన్నటిదాకా బర్రెల్ని పోట్టన పెట్టుకుంటుందయ్యాగారు. రాతిరే....బంగారంలాంటి పసోడ్ని పొట్టబెట్టుకుంది" అన్నాడు దిగులుగా.

"ఇన్నాళ్ళెందుకు ఊరుకున్నారు?" అన్నాడు చిన్ని.

"ఏటిసెయ్యాలి. ఓడికి అంత ధైర్యంలేదు. దొరగారితో మొత్తుకున్నా ఉపయోగంలేదు. గూడెవంతా ఖాళీ సెయ్యాలనుకుంటున్నాం దొరా" అన్నాడతను.

"సరే. ఇలా వెళితే అడవిలోకి వెళుతుందిగదా!"

"వెళ్ళద్ది."

"కారు లోపలకు పోతుందా?"

"కొంతదూరం పోద్దయ్యా."

"మంచిది" అంటూ దూసుకొచ్చి కారెక్కాడు.

"అడవిలో పెద్ద చిఱుతపులి వుందట. రాత్రి ఎవరో కుర్రాడిని లాక్కుపోయిందట. పులి ఒక్కసారి మాన్ ఈటర్‌గా మారిందంటే ప్రమాదకర స్థాయికి పోయినట్లే. విచిత్రం ఏమిటంటే వీళ్ళ అతీ గతీ చూసినోళ్ళు లేరు. వాళ్ళంతా దాని భయంతో గూడెం ఖాళీ చెయ్యాలనుకుంటున్నారు" చెప్పాడు చిన్న.

సృజన్ కారు నడుపుతున్నాడు.

"మన దగ్గర అమ్యూనిషన్ వుందా?"

"ఆఫ్‌కోర్స్. రాబర్టుగారిచ్చిన డాగర్ వుంది" చెప్పాడు సృజన్.

"అంతేనా?"

"రివాల్వర్ కూడా వుంది."

"దెన్, ఓ.కె."

కారు అడవిలోకి ప్రవేశించింది. విశాలమైన వృక్షాలతో నిండివుంది. కొంతదూరం వెళ్ళాక ఇంక వెళ్ళటం సాధ్యం కాలేదు.

కారాపి క్రిందకు దిగారు.

ముగ్గురూ నడుస్తున్నారు.

"బీ....ఎలర్టు....ఏ క్షణం అయినా అది మనమీదకు రావొచ్చు" అన్నాడు సృజన్.

వాళ్ళు నడుస్తుంటే ఎండుటాకులు నలిగిపోతున్నాయి.

ఆ శబ్దాలు వినిపిస్తున్నా భయంకరమైన నిశ్శబ్దం ఆ ప్రదేశమంతా ఆవరించుకొని వుంది.

విజయ్ క్రిందకు వంగి తీశాడు.

అరడుగుల కర్ర.

గాల్లో గిర్రున త్రిప్పాడు.

అఘోరకమైన శబ్దం!

"ఓ గంట వ్యాయామం చేద్దాం" అన్నాడు విజయ్. చుట్టూ దట్టంగా పొదలున్నాయి. వాటి మధ్యలోనే కొంత ఖాళీ ప్రదేశం వుంది. వ్యాయామం మొదలయింది.

కర్రసాము.

ఆసనాలు.

ఒక్కో అంశం మొదలయింది.

చిన్ని నిలబడి వున్నాడు. అంతలోనే అతని కండరాలు బిగుసుకున్నాయి. గాల్లోకి లేచాడు. నోటినుండి వెలువడిందో షౌట్. అడవి దద్దరిల్లేటట్లు.

గాల్లోకి లేచిన చిన్ని చెయ్యి విసురుగా తాకిందో చెట్టు కొమ్మని. పచ్చిగా వుందది. ఫటక్‌మంటూ విరిగిపోయింది.

అదే క్షణంలో మరో విచిత్రం జరిగిపోయింది. ఆ కొమ్మ మీదనుండి 'డబ్'మంటూ క్రిందపడిందో నల్ల త్రాచు. క్రిందపడి అంతులేని ఆగ్రహంతో పడగవిప్పి చిన్నివంక చూసింది. చిన్ని ఇదేం గమనించలేదు. మరో సారి గాల్లోకి లేచాడు.

అదే మంచిదయింది.

త్రాచు కాటు వృథా అయింది.

ఆ శబ్దానికి గాల్లోనే మాశాడు చిన్ని.

గుండె గుభేల్‌మంది.

తను క్రిందకు వాలిన మరుక్షణం.... స్నేక్.... యెంత పరిణామంలో తన శరీరంలోకి విషం పంపుతుందో.... ఆ తర్వాత... నల్లగా మారి.... నోట్లో నురుగుతో....

“నీ చాప్టర్ ఎండ్ రా చిన్నీ” అనుకున్నాడు.

అంత వేగంతో తోకమీద లేచింది నల్లత్రాచు అంతులేని క్రోధంతో.

“స్.... స్.... స్.”

ఎగిరి అవతల పడింది త్రాచు.

అప్పుడే నేలను తాకాయి చిన్ని కాళ్ళు.

త్రాచు గిలగిల కొట్టుకుంటోంది.

దాని పడగ నడుమనుండి దూసుకుపోయింది సృజన్ విసిరిన డాగర్. మొన తళతళ మెరుస్తోంది.

“థాంక్స్ గురూ. అయిపోయాననుకున్నాను.”

“అయినా వున్నచోటు నుండవు. ఆ కొమ్మెందుకు విరగ్గొట్టావు?” అన్నాడు విజయ్.

“చాలా రోజులయింది గురూ పొజిషన్ చూసుకొని.”

“కమాన్. బీ ఎలర్టు. చిరత సంగతి మీరు మరిచిపోతున్నారు” అంటున్నాడు సృజన్.

అప్పుడే వినిపించింది.

కెవ్వుమన్న కేక!

గుండె లవిసేటట్లు!!

విజయ్ ఎగిరి గంతేశాడు ఆ శబ్దం వచ్చిన దిక్కుకు. పొదల్లో ముళ్ళు గీసుకుపోతున్నా లక్ష్యపెట్టకుండా. అతడి చేతిలో ఇంకా కర్ర వుంది. చిన్నికూడా వేగంగా అనుసరించాడు.

సృజన్ డాగర్ను లాగి రక్తాన్ని ఆకులకు తుడిచాడు. పొద దాటిన తర్వాత కనపడిందా దృశ్యం.

చిరతపులి యెవరో వ్యక్తిమీద దాడిచేసింది. భుజం మీద షర్టు చినిగిపోయి ధారలుగా కారుతోంది రక్తం. మరోసారి గాల్లోకి లేచి అతని మీదకు దూకబోతోంది. విజయ్ గాల్లోకి లేచాడు. చేతిలో కర్ర స్టిక్‌గా మారింది. కండరాలు పొంగుతుండగా ఫట్‌మంటూ కొట్టాడు పులిని.

పెద్ద శబ్దంతో కర్ర విరిగిపోయింది.

సగం ముక్క ఎటో యెగిరిపోయింది.

ఆ దెబ్బకు ఒక్కసారిగా బిత్తరపోయింది. అంతలోనే ఆగ్రహంతో గర్జించింది. అడవంతా ప్రతిధ్వనించింది. యిప్పుడు దాని చూపులు విజయ్ మీదున్నాయి.

విజయ్ రెడీగా నిలబడ్డాడు.

ఎగిరి మీదకు దూకింది.

రెండు చేతుల నడుమ వున్న కర్ర మధ్య దాన్ని బాలెన్స్ చేస్తూ గాల్లోకి విసిరేశాడు. ఒక్కసారి వెల్లకిలా పడింది.

పులి విసిరిన పంజా లైట్‌గా భుజాన రాసుకుంటూ వెళ్ళింది. చొక్కా చినిగి రక్తం చిమ్మింది. వెంటనే చురచురలాడటం ప్రారంభించింది.

చిరతపులి క్రిందపడ్డ క్షణం దానికి వినిపించిందో స్వరం తన అరుపుకు దీటుగా.

మరుక్షణం చిన్ని పాదం ప్రళయవేగంతో దాని దవడమీద పడింది.

కోరలు కదిలపోయాయి.

వాళ్ళముందు పసిబాలుడి వదనం కనిపిస్తోంది.

మూలుగుతూ కష్టంమీద నిలబడింది. రెండుప్రక్కల

నిలబడ్డవారిని చూసి ఎవరిమీదకు తూటాలో నిర్ణయించుకోలేకపోతోంది.

అంతలోనే గాల్లోకి లేచింది.

తలలోనుండి దూసుకుపోయిందో బుల్లెట్.

ఎగిరి అంత దూరంలోపడి వికృతంగా అరిచింది.

మరో గుండు గొంతులో....

ఇంకోటి పొట్టలో....

గిలగిల కొట్టుకుంటూ, కొంతసేపయ్యాక మానేసింది.

పులివాతపడి క్రిందపడివున్న వ్యక్తిని చూశారు. చిన్ని కొన్ని ఆకులు కోసుకొచ్చి అతని గాయం మీద పిండాడు. అతని చొక్కా చించి కట్టు కట్టాడు.

అతను కళ్ళు మూసుకుంటూ అన్నాడు మెల్లగా—

"మీరే ఈ జమిందారు మనవడిగా భావించాను. ఈ పల్లెలోకి మీరు రావటం గమనించాక మిమ్మల్ని వెంబడిస్తున్నాను. ఈ చిరతపులి చాలా కాలంనుండి పశువుల్ని అపహరించుకుపోతుంది. నిన్న సాయంకాలం ఓ పిల్లాడ్ని తీసుకెళ్ళి చంపింది. ఈ ప్రజలు ఇక్కడే భయం భయంగా బ్రతుకుతుంటారు. వీళ్ళంతా మధ్య యుగాల్లో బానిసల్లా బ్రతుకుతున్నారు. కనుచూపు మేరలో మీరెక్కడయినా గమనించండి. పచ్చదనమే కనిపిస్తుంది. కానీ వారి జీవితాల్లో అదే కరువయింది.

జనంలో ఏమాత్రం కదలిక కన్పించినా జమీందారు వాళ్ళని నాశనం చేస్తాడు. ఆ భవనంలో మహా వృక్షాలున్నాయి. అవి ఫలాలు కాస్తాయి. రాలిపోతాయి. అదలా కుండిపోవాల్సిందే. వాటిని తినేవారుండరు. మరొకరు తాకకూడదు. ఆ చెట్టు నీడలో సైతం ఎవరు నిలబడ్డా సహించలేడు జమిందారు.

అంత దుర్మార్గంగా, రాక్షసంగా ప్రవర్తించే ఆ జమిందారు వంశంలోనే జన్మించారు — సున్నితమైన హృదయంకల వ్యక్తులు ఇద్దరు. కిరణ్ ఆమె చెల్లెలు. వారిద్దరికి ఈ వైభవం గురించి, అధికారాల గురించి ఏమాత్రం ఆలోచనలేదు. చిన్నప్పటినుండి ఈ దుర్మార్గుడి నీడలో పెరిగినా ఆ ఛాయలు సోకలేదు. కిరణ్ ప్రేమించాడో అమ్మాయిని...."

"షి....ఈజ్ మేరీ" అన్నాడు సృజన్.

"అవును. ఆ అమ్మాయే చాలా పొరపాటు చేసింది. కిరణ్ గానానికి మురురాలయింది. అదే ఆమె జీవితానికి పెద్ద ప్రతిబంధకం అయింది. ఈ వార్త తెలిసిన రావ్ బహుద్దర్ భగ్గున మండిపడ్డాడు. కిరణ్‌ను వారించాలని చూశాడు. లాభంలేకపోయింది. అప్పుడు మామూలుగానే తన పథకం ప్రారంభించాడు. మేరీని బెదిరించాడు. డబ్బు ఆశ చూపించాడు. ఏం ప్రయోజనం కనిపించలా. రెండు సార్లు చేయించిన హత్యా ప్రయత్నం విఫలం అయింది. ఫలితం మేరీ మాయం అయింది. ఆ తర్వాత కిరణ్ మాయమయ్యాడు" అన్నాడతను.

"ఇద్దరూ కలిసి ఎక్కడికయినా వెళ్ళి వుండవచ్చా?"

"లేదు. వాళ్ళు నిజంగా అలా చేస్తే రావ్ బహుద్దర్ ఇంత తాపీగా వుండడు. దేశమంతా గాలించి యెక్క డున్నా పట్టుకొచ్చేవాడు."

"మరేమై వుంటారు" అన్నాడు సృజన్.

"నా అనుమానం....బహుద్దర్ కిరణ్‌ను దాచివుండ వచ్చు. మేరీని మాత్రం...." ఆ తర్వాత మాట్లాడలేక పోయాడు. గొంతు ఉద్వేగంతో వణికింది.

"అయితే కిరణ్‌ను యెక్కడ దాచి వుండవచ్చు."

"జమిందారుల భవనాలంటేనే రహస్య మందిరాలు, యెన్నెన్నో రహస్యాలు ఆ గోడల నడుమ సమాధి అవుతుంటాయి. ఆ భవనంలో యే రాయిని, రప్పనీ అయినా అనునయించి అడిగితే చెబతాయి అంతులేని రహస్యాల్ని" అన్నాడతను భావగర్భితంగా.

సృజన్ తలపంకించాడు.

"ఏదిఏమైనా నన్ను ప్రాణాపాయంనుండి కాపాడారు."

"మీకు జీవితాంతం ఋణపడివుంటాను."

"భలేవారే. ఇందులో ఏముంది."

"ఇందులో ఏముందని తీసి పారెయ్యకండి. ఆ చిరుత బలికుంటే మరెన్ని ప్రాణాలు పోయేవో యెంతమంది చచ్చినా ఆ జమిందారు లెక్క చేసేవాడు కాదు. అవసరం అయితే బారుతుపాకి ఒకటి చేతిలో పట్టుకుని కొంగల్ని కాలుస్తాడుగాని, ఇలాంటి వాటినుండి జనాన్ని మాత్రం రక్షించడు" అన్నాడతను.

"వన్యమృగ సంరక్షకుడు" అన్నాడు చిన్ని.

అతను నవ్వాడు

"సరే, మేం వెళ్తాం. మరోసారి కలుసుకుందాం" అన్నాడు సృజన్.

"తప్పకుండా."

అందరూ కారు దగ్గరకు నడుస్తున్నారు.

సృజన్ అతన్ని అడిగాడు.

"ఇంతకూ ఈ విషయం మీద మీకెందుకింత ఇంట్రెస్టు."

"మేకీ నా చెల్లెలు కాబట్టి."

# 9

అర్ధరాత్రి దాటింది.

నిశ్శబ్దపు గుండెలమీద పాతకాలపు గడియారం కొట్టిన దెబ్బల ప్రకంపనాలింకా ఆ గదిని ఆవరించు కున్నాయి. సృజన్ లేచాడు. విజయ్ రూమ్ దగ్గరకు వెళ్ళాడు. అపరకే నిలబడి యెదురు చూస్తున్నాడు విజయ్, చిన్నితో కలిసి మెల్లగా అడుగులు వేసుకుంటూ.

"మీ గదుల్లో యేమైనా."

"నో ....ఏమీ లేదు."

చాలా మెల్లగా మాట్లాడుకుంటున్నారు.

పైన ఖాళీగా వున్న గదులన్నింటినీ పరిశీలించారు. గోడలను తడిమి చూశారు. వాటినిండా యెవరెవరివో పెద్దపెద్ద చిత్రాలున్నాయి. రాజరికం వలకబోస్తూ, కొన్నింటిలో అంతులేని క్రూరత్వం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. వాటన్నింటిని గమనిస్తూ ఆయా గదుల్లో ప్రతిభాగం క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి ఆధారం లభించలేదు.

సృజన్ భృకుటి ముడిపడింది.

ఆలోచిస్తున్నాడు.

"సంధ్య తాతగారి గదిలో యేమైనా" మెల్లగా అన్నాడు చిన్ని.

కొరడాతో వీపుమీద చరిచినట్లు ఉలిక్కిపడ్డాడు.

"కరెక్టు. నీ ఆలోచన నిజం అయితీరుతుంది."

అప్పుడు వినిపించింది.

గడియారం రెండు గంటలు కొట్టిన శబ్దం.

ఉలిక్కిపడ్డారు.

"సరే రేపు ట్రై చేద్దాం" అన్నాడు సృజన్.

ఎవరి గదుల్లోకి వారు వెళ్ళిపోయారు.

మర్నాడు కాలకృత్యాలు పూర్తయ్యాక తిరిగి అందరూ ఆ పురాతనకాలంనాటి డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నారు.

"సంధ్యా..మీ తాతగారింతవరకు దర్శనం ఇవ్వలేదు" అన్నాడు సృజన్.

"ఆయనెక్కడికో వెళ్ళారు?"

"ఎక్కడికి వెళ్ళుంటారు?"

"అదెవరికీ చెప్పరు."

"ఓహో! పోనీ యెప్పుడు వస్తారు."

"బహుశా, ఈ రాత్రికి....ఎందుకు?"

"జస్టు చూడాలని."

"చాలా భయంకరంగా వుంటాడు" అంది నవ్వుతూ.

"అలాగా. సరేగాని ఏం తోచటం లేదు, ఈ కోటంతా చూపించవా" అడిగాడు సృజన్.

"అలాగే చూద్దాం."

బ్రేక్‌ఫాస్టు పూర్తయింది. సంధ్య వెంటరాగా మొత్తం కోటంతా చూడటానికి బయలుదేరారు.

రకరకాల మంచాలు....దివ్వె..దుప్పట్లు.... టేకుతో చేయబడ్డ అమూల్యమైన వస్తువులు .... మహత్తరమైన కళాఖండాలు అన్నీ గదుల్లో మూలుగుతున్నాయి. వాటన్నిటినిండా బూజుపట్టి వుంది. అవి ఆ కోటలో సమాధి కావల్సిందేమో ననుకున్నారు.

సంధ్య వాళ్ళ తల్లిదండ్రుల గదిని చూపించింది. కిరణ్ గదిని చూపించాక అతన్ని అర్థం చేసుకోగలిగారంతా.

ఆ గదినిండా కళాత్మకత ఉట్టిపడుతోంది.

గోడలకున్న తైలవర్ణ చిత్రాలు అమోఘంగా వున్నాయి.

గోడకు తగిలించబడ్డ పిల్లనగ్రోవి పలకరిస్తోంది.

సన్నగా గాలివీచింది.

పిల్లనగ్రోవినుండి దూసుకెళుతూ వుండగా వచ్చిందో వింత శబ్దం!

చిన్ని వెళ్ళి దాన్ని అందుకున్నాడు.

"మీ తాతగారి గది చూపించవా" అనడిగాడు సృజన్.

"అమ్మో" అంది సంధ్య.

"ఏమిటి?"

"ఆయన గదికి యెవరూ వెళ్ళకూడదు."

"నువ్వు కూడానా."

"నేనైనాసరే ముందు ఆయన అనుమతి పొందాలి."

"అలాగా" అన్నాడు ఆలోచిస్తూ.

"ఎటూ ఆయన లేడుగా చూసివద్దాం" అన్నాడు తిరిగి సృజన్.

సంధ్య ఇబ్బందిగా చూసింది.

తర్వాత సంధ్య ఒక తాళంచెవి తెచ్చి ఇచ్చింది.

"మీరో పని చెయ్యాలి. ఆ గదిలో ఏ వస్తువును టచ్ చెయ్యకండి. చూసిన వెంటనే లాక్ చెయ్యండి" అంది సంధ్య.

"నువ్వు రావా?"

"నాకా కొంచెం తలనొప్పిగా వుంది రెస్టు తీసుకుంటాను."

"అలాగే."

సంధ్య వెళ్ళిపోయింది. రావ్ బహద్దర్ గదిముందు

నిలబడ్డారు.

ఎత్తయిన తలుపులు గంభీరంగా వున్నాయి.

సృజన్ మిత్రులవంక చూశాడు.

మృత్యు గృహాంలోకి అడుగు పెడుతున్నట్లనిపించింది.

తాళం తీశాడు.

తలుపు ముందుకు నెట్టాడు.

లోనికి ప్రవేశించారు.

తిరిగి తలుపు మూసేశారు.

గోడలనిండా జంతువుల చర్మాలు....తలలు....తుపాకులు....

వాటి నడుమ....

నిలువెత్తుపటంలో

కళ్ళనిండా క్రూరత్వం నింపుకొని రాచరికపు హోదాతో....

రావ్ బహాద్దర్!

గదంతా పరిశీలించటం మొదలుపెట్టారు.

చిన్ని రావ్ బహాద్దర్ బట్టల్ని....పాదుకల్ని పరిశీలిస్తున్నాడు.

విజయ్ మూలగా వున్న చోటుకి వెళ్ళాడు.

అక్కడ ఓ లెదర్ కేసు వుంది. జిప్ లాగాడు.

ధగధగలాడుతుంది!

వజ్రాలతో పొదగబడ్డ పిడిగల కత్తి!

దానికి రెండువైపులా పదును వుంది.

దాని మొనమీద బొటనవ్రేలు వుంచాడు.

క్షణంలో మొదలయింది ఓ రక్తపుచుక్క.

క్రమంగా పెద్దదవుతూ.

"ఇదేంటో బలిగోరే కత్తిలా ఉందే!"

అనుకుంటూ వెనక్కి తిరిగాడు.

అప్పుడు వినపడిందో శబ్దం... !

తలుపు తెరుచుకుంటున్న సవ్వడి.

సృజన్ ఆనందంగా చూస్తున్నాడు.

భూగర్భంలోకి మెట్లు కనిపిస్తున్నాయి.

"కమాన్" అరిచాడు మెల్లగా.

ఇద్దరూ అలానే బయలుదేరారు.

చిన్ని బాడ్డులోనుండి పిల్లనగ్రోవి తీశాడు.

విజయ్ కోపంగా చూస్తూ నడుస్తున్నాడు.

"బీకేర్ ఫుల్" అన్నాడు సృజన్.

మెట్లు అంతం అయ్యాయి.

తిరిగి గోడంతా తడిమారు. గోడకు ఓ బటన్ లాంటిది వుంది. దాన్ని ప్రెస్ చేశారు.

అంతా చీకటిగా వుంది.

ముగ్గురూ మెల్లగా తడువుకుంటూ క్రిందకు వెళ్ళారు.

ఎక్కడినుండో సన్నటి వెలుగురేఖ పడుతోంది.

దాన్ని అనుసరిస్తూ ముందుకు బయలుదేరారు.

మెల్లగా ఆఖరు మెట్టు దిగారు.

ఆ క్షణం వినిపించిందో స్వరం!

గుండె లోతుల్ని తొలుస్తూ....

విషాదాన్ని...ప్రేమను నింపుకొని.

అగాధాల లోతులనుండి హిమాలయాల ఎత్తుల దాకా!

స్తంభించి నిలబడ్డవారిని

మేలుకొల్పింది—ఆ పాట!

## 10

"కిరణ్ !....నీకు దుఃఖంలోనూ పాటలే! "ఎగతాళిగా అన్నాడు రావ్ బహద్దూర్.

"తాతగారూ" అరిచాడు కిరణ్.

"ఊ" అంటూ గంభీరంగా ఉరిమాడు.

"ప్రేమల్ని శాసించినవాడు చరిత్రలో మిగలలేదు."

"మీ ప్రేమికులు నిలబడ్డారా?"

"ప్రేమ అనంతమైనది."

"ఛ .... ప్రేమ .... మన దేశంలో ప్రేమలకు చావు లేదు. భార్యను ప్రేమించటానికయినా కొన్ని హద్దులున్నాయి. ఈ కోటలో బిడ్డకూ, తల్లికి కూడా నియమాలున్నాయి. ఇంతకాలం అలాంటి క్రమశిక్షణ ఉండబట్టే మా వైభవం ఇంకా కొనసాగుతుంది. కానీ నువ్వు ఈ వంశాన్నే భ్రష్టు పట్టించదలుచుకున్నావు. ఓ అలగా మనిషిని ప్రేమించానంటూ బయలుదేరావు. యేదో లే సరదా తీర్చుకొని వదిలేస్తావనుకున్నాను. కానీ మన ఆస్తుల్ని దోచుకోమంటూ జనాల్ని తిరుగుబాటు చేయించటానికి పూనుకున్నావు. ఈ నేరాన్ని మాత్రం క్షమించను. నా బిడ్డయినా సరే ఈ వంశం పునాదుల కదిలించాలనే వెర్రి ప్రయత్నంచేస్తే ఈ రాన్ బహద్దర్ న....లి.... పే ...స్తాడు" ఒక్కొక్క మాట వత్తిపలుకుతూ అన్నాడు.

అంతలోనే ఆయన కంఠం మారిపోయింది.

"చూడు కిరణ్. ఈ జమీ నీది. ఈ ఆస్తులు నీవి. ఇదంతా మీకోసమే. నువ్వు మూర్ఖపు పట్టుదలను మానుకోవాలి. మన వంశం నాతోనే ఆగిపోకూడదు. నువ్వు ముందుకు తీసుకుపోవాలి. నువ్వు ఊ అంటే చాలు మన కోటవాకిట్లో వందలాది అప్సరసలు నీకోసం యెదురు చూస్తుంటారు. నువ్వా పేరీని మరిచిపో.... రా.... మన ఎస్టేట్ వ్యవహారాలన్నీ స్వయంగా చూస్కో."

"ఈ రక్తపు కూడు నాకొద్దు."

"రక్తపు కూడా" ఆగి నవ్వాడు. ఆ నవ్వులో తరతరాల అధికారదర్పం మిళితమై వుంది.

"నీ అణువణువులో వుంది ఆ రక్తమే. అందుకని ఛస్తావా?"

"ఆ పాపం పోవటానికి ఎవడి భూములు వాడికిచ్చి, యెవరి ఆస్తులు వారికి పంచితే మనం ప్రశాంతంగా బ్రతుకుదాం."

"ఊ" అన్నాడు గంభీరంగా రావ్ బహద్దర్.

"ప్రశాంతత. ఊరవతల .... పచ్చికలో నువ్వు పాడుతుంటే__నీ వడిలో అది పడుకుంటే ప్రశాంతత. జీవితానికి అర్థం బాగా చెప్పావ్. నువ్వు నీ అభిప్రాయాలు మార్చుకోనన్నమాట. చివరిసారిగా అడుగుతున్నాను. నువ్వు నా మార్గంలోకి రా."

"క్షమించండి తాతగారూ.... మీ వృద్ధాప్యంలో మా గురించి ఇంత శ్రమెందుకు. నేను చెప్పినట్లు చెయ్యండి."

"ఆపు" అరిచాడు. "గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించిందట తాతకు దగ్గులు నేర్పుతున్నావ్. పరువుకోసం ప్రాణాలిచ్చే వంశంలో ఈ రావ్ బహద్దర్ పుట్టాడు. నువ్వు అనుభవిస్తావు" చర, చర నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

చిన్ని ముందుకు కదిలాడు.

సృజన్ వారించాడు.

"మే... రీ" కిరణ్ కేక.

ఎక్కడో చిన్న మూలుగు.

కిరణ్ వెక్కిళ్ళు వినిపిస్తున్నాయి.

"కిరణ్ .... ఈ నరకం భరించలేను .... నేను వెళ్ళి

పోతున్నాను...." మేరీ గొంతు.

"మేరీ.... మేరీ....అన్యాయం."

"కాదు. నేను చెడిపోయాను."

"లేదు. నువ్వు చెడిపోలేదు."

కటకటాల అవతల మేరీ నేలపై నిస్సత్తువుగా పడి వుంది.

"మేరీ .... మేరీ" రుద్ధ కంఠంతో అంటున్నాడు కిరణ్.

మేరీ శరీరంమీద చీర పేలికలయి వుంది. శరీరం నిండా రక్తపు మరకలతో గడ్డగట్టుకుపోయి వున్నాయి, అసహ్యంగా.

ఆమె కష్టంమీద కళ్ళు తెరిచింది.

"నన్ను నాశనం చేశారు కిరణ్."

"అలా మాట్లాడకు మేరీ....నువ్వు నాశనం కాలేదు. నువ్వు పవిత్రమైనదానివి. ఆ దోషం నీకు అంటదు" కటకటాలనుండి కిరణ్ అంటున్నాడు.

"లేదు కిరణ్. ఒక్క రోజు కాదు. పదిరోజులనుండి ఒక్కడు కాదు. యెందరెందరో. ఈ నరకం ఇంకా భరించలేను."

"మేరీ నేను నీ శరీరాన్ని ప్రేమించటంలేదు."

"అయినా సరే. కడసారి నిన్ను చూడటం కోసం మాత్రమే ఇన్ని రోజులు బ్రతికున్నాను. ఇప్పుడు తృప్తిగా వెళ్ళిపోతున్నాను" అంది మేరీ తల వాల్చేస్తూ.

"మేరీ" దిక్కులు పిక్కటిల్లేటట్టు అరిచాడు.

కిరణ్ అరుపుకు ఉలిక్కిపడ్డాడు చిన్ని.... చేతిలో వున్న పిల్లనగ్రోవి జారిపడి దొర్లుకుంటూ వెళ్ళింది.

మేరీ చివరి చూపులు....ప్రేమగా....నిశ్చలంగా....

పిచ్చిగా జుట్టు పీక్కుంటున్న కిరణ్ దగ్గరకు దొర్లింది పిల్లనగ్రోవి.

చివ్వున తలెత్తాడు.

కళ్ళముందు శవం!

తన ప్రక్క వేణువు.

అందుకున్నాడు.

రావ్ బహద్దర్ అరిచాడు.

“ఎవరక్కడ?”

సృజన్ ....చిన్ని ....విజయ్ ఎలర్టు అయ్యారు.

“వెతకండి” అరుస్తున్నాడు

నల్లటి తుమ్మమొద్దులాంటి ఇద్దరు అజానుబాహువులు ఆ వైపుకొచ్చారు. వారిలో ఒకడికి ముందు చిన్ని కనబడ్డాడు. బరిసె విసరబోయేవాడల్లా ఓ క్షణం అనుమానంతో ఆగాడు.

మరుక్షణం గుండెల్లో పొడిచాడు.

మెరుపులా ప్రక్కకు దూకాడు చిన్ని.

అయినా సరే చొక్కాను రాసుకుంటూ వెళ్ళి గోడకు దిగబడింది.

చిన్ని వెర్రికేక వేశాడు ఆగ్రహంతో.

గాల్లోకి ఎగిరాడు.

రాకెట్ వేగం! గుండెలమీద రెండు కాళ్ళు ఒక్కసారే అప్లయిచేశాడు. పెనుగాలికి చెట్టు ఊగినట్టు ఊగినట్టు వూగి క్రిందపడ్డాడు.

రెండోవాడు విజయ్‌కు గురిచూసి విసిరిన బాకును గాల్లోనే అందుకున్నాడు. దాన్ని మోకాలుమీద చరిచాడు.

నడుముకు వంగిపోయింది.

దాన్ని మూలకు విసిరేశాడు. పిడికిలి బిగించి కడుపులో ఓ దెబ్బ కొట్టాడు.

అప్పుడు గాల్లోకి ఎగిరిన విజయ్ నోటినుండి వెలువడింది స్వరం. మరుక్షణం ధృఢకాయుడి వీపుమీద బలంగా పడిందో ఇండియన్ మేడ్ పిడిగుద్దు!

వాడికి ఓ క్షణం ఏమీ అర్థంకాలేదు.

అంతా శూన్యంగా వుంది.

ఆ తర్వాత పిచికారీ కొట్టినట్టుగా నోటినుండి రక్తం భళ్ళున పడుతుండగా క్రిందకు వాలిపోయాడు.

సృజన్ ఆసరికే పరుగెత్తుకెళ్ళి కిరణ్ ముందు నిలబడ్డాడు. జైలులాంటి ఆ గదిలో పిచ్చెక్కినవాడిలా వున్నాడు కిరణ్.

క్షణంలో జరిగిన ఈ మార్పులకు రావ్ బహద్దర్ వదనం ఒక్కసారి మాడిపోయింది. చేతిలో హంటర్ గాలిలోకి లేచి సృజన్ వీపుమీద పడింది. చొక్కాని చీల్చి శరీరాన్ని ముద్దాడింది.

చివ్వున అటువైపు తిరిగాడు.

"కి....ర....ణ్" అన్నాడు రావ్ బహద్దర్ కంగారుగా. ఆయన కళ్ళలో ఆశ్చర్యం! అనుమానం! ఏవేవో జ్ఞాపకాలు!

సృజన్ ఆయన చేతిలోని హంటర్ను విసురుగా లాగాడు.

అప్పుడు తేరుకున్నాడు రావ్ బహద్దర్.

హంటర్ విసిరి జైలు తలుపులను ఎగిరి తన్నాడు సృజన్.

చువ్వలు వంగిపోయాయి.

కిరణ్ చూస్తున్నాడు మేరీవంక.

మేరీ మాసోంది శూన్యంలోకి.

మరోసారి తన్నేసరికి మనిషి వచ్చే ఖాళీ ఏర్పడింది.

కిరణ్ చేతిలోని వేణువు కమ్మలకేసి బాదాడు. విరిగి పోయింది.

మొన పదునుగా వుంది.

గదినుండి బయటకు వచ్చాడు.

రావ్ బహద్దర్ ఆగ్రహంతో మండిపోతున్నాడు.

ఆయాసకంతో ఫజిల్ లా వుంది.

కిరణ్ సుడిగాలిలా దూసుకుపోయాడు.

ఆవేశంతో బ లం గా వేణువు.... రావ్ బహద్దర్ పొట్టలో పొడిచేశాడు.

రక్తం వరదలుగా పారుతోంది.

రావ్ బహద్దర్ కడుపు చేత్తో పట్టుకుంటూ అరిచాడు.

"చంపండి.... చంపండి."

అరుస్తూనే పడిపోయాడు. మెల్లగా ప్రాక్కుంటూ వెళ్ళి అక్కడ వున్న గంటను ప్రయోగించాడు. బిలబిల మంటూ దూసుకొచ్చారు ఓ పదిమందిదాకా.

కిరణ్ కు ఇవేం పట్టడంలేదు.

మేరీముందు నిశ్చలంగా నిలబడి చూస్తున్నాడు.

చేతికంటిన రక్తంతో మేరీ నుదుట తిలకం దిద్దాడు. అక్కడకు వచ్చినవారికి రావ్ బహద్దర్ ను ఆ స్థితిలో చూసేటప్పటికి ఉద్రేకం వచ్చింది. ఒకడు బరిసె తీసుకుని కిరణ్ మీదకు పోతున్నాడు.

విజయ్ పెద్దగా గొంతెత్తి అరిచాడు.

అప్పటికే ఆలస్యం అయింది.

కిరణ్ యెన్నులోనుండి దూసుకుపోయి బయటకు వచ్చింది బరిసె మొన....

'కెవ్వున' అరిచాడు కిరణ్.

ఆ అరుపులో మరో అరుపు కలిసిపోయింది. విజయ్ విసిరిన కత్తి పిడివరకు దిగబడింది బరిసె విసిరిన వ్యక్తి కడుపులో.

సృజన్....

చిన్ని....

విజయ్....

కిరణ్ వంక చూశాడు.

అతని ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.

అతని చేయి మేరీ చేతిని పట్టుకొని వుంది.

ఆగ్రహంతో మండిపోయాడు.

సృజన్ హృదయాన్ని కదిలించిందా దృశ్యం.

అతని పిడికిలి బిగుసుకుంది.

అతనిలో మానవత్వం తాలూకు ఛాయలు అదృశ్యం అయ్యాయి.

గాల్లోకి లేచిన అతని నోటినుండి వెలువడుతుందో శబ్దం. వందకందిరీగలు గిర్రున తిరిగేటప్పుడు వచ్చే శబ్దం.

ఆ మూమెంట్స్ ఎవరికీ అర్థంకావటంలేదు.

రావ్ బహద్దర్ కళ్ళు మూతలు పడుతున్నాయి.

రక్తం ఇంకా ధారాపాతంగా కారిపోతుంది.

ఆ చివరి క్షణాల్లో ఆయన కళ్ళముందు మెరుపులు కనిపిస్తున్నాయి. ఒక్కొక్కరు నేలమీద పడుతున్నారు. తిరిగి వారు లేవటంలేదు.

దాదాపు పదినిముషాలు సాగిందలా.

సృజన్ ఆగాడు.

అప్పటికెవరూ లేరు.

ప్రళయ భీకరంగా కనిపిస్తున్నాడు సృజన్.

ఆ క్షణంలోనే....

రావ్ బహద్దర్ ఆశ్చర్యంగా చూస్తుండగానే ప్రాణం ఎగిరిపోయింది.

•   •   •

"నా కాళ్ళక్రింద భూమిలో ఇన్ని రహస్యాలున్నాయని నాకు తెలియదు. యేమైనా నేను ఒంటరిదాన్నయి పోయాను" అంది సంధ్య, తాత అన్న వదినల అంత్య క్రియలు జరిగాక.

సృజన్ మాట్లాడలేదు.

"ఏది ఏమైనా నాకు ముగ్గురు అన్నలు దొరికారు. అదే అదృష్టం" అంది.

"నేను ఇంగ్లాండు వెళ్ళదలుచుకున్నాను. మీరు ఉత్తరాలు రాస్తుండాలి. అదే నా చివరి కోర్కె" అంది సంధ్య.

"తప్పకుండా" ముక్తకంఠంతో అన్నారంతా.

"విత్ యువర్ పర్మిషన్ ఈ కత్తి నేనుంచుకుంటాను" అన్నాడు విజయ్.

"అంతకంటేనా" అంది సంధ్య.

"ఈ భూములూ.... ఈ ఆస్థులూ...." అడిగాడు సృజన్.

"వీటిగురించి నేను పట్టించుకోను. మనశ్శాంతి కావాలి ముందు నాకు."

"సో.... మేం వెళ్తాం. మరలా కలుసుకుందాం." అన్నాడు సృజన్.

## 53

"మరలా మనం కలుసుకోగలమా అన్నయ్యా!" గాద్గదికంగా అంది.

సంధ్య కళ్ళవెంట నీళ్ళు.

"తప్పకుండా కలుసుకుంటాం చెల్లీ" ధృఢంగా అన్నాడు.

సంధ్య తడికళ్ళతో వీడ్కోలిచ్చింది.

భారంగానే బయలుదేరారు ముగ్గురూ తమ కారులో.

—:అ యి పో యి ం ది:—